# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- వరద బాధితులకు హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా ఆహారం అందజేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- కృష్ణానది వరద పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.
- కృష్ణానది కరకట్ట బలహీనంగా ఉన్న చోట్ల మరమ్మతులు చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.
- వాయువ్య బంగాళాఖాతంలో ఈ నెల 5వ తేదీన మరొక అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.
- ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అర్జీదారుల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.

==========================

హెలికాప్టర్ల, డ్రోన్ల ద్వారా వరద బాధితులకు ఆహారం అందజేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వరద పరిస్థితులపై మరోసారి ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో ఈరోజు సమీక్షించారు. మూడుపూటలా బాధితులకు ఆహారం అందించాలని.. చిన్నారులు, గర్భిణులను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. బోట్లు ఎక్కడెక్కడ తిరుగుతున్నాయో మ్యాపింగ్ చేయాలని, ఒకే ప్రాంతంలో కాకుండా మారుమూల ప్రాంతాలకు కూడా వెళ్లేలా అధికారులు సూచించాలన్నారు. లంక గ్రామాల్లో సమస్యలపై అధికారులను అప్రమత్తం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. అందరికీ సాయం అందుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

==========================

కృష్ణానది వరద పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. కృష్ణానది కరకట్ట.. మంతెన సత్యనారాయణ రాజు ప్రకృతి వైద్యశాల వద్ద ఏర్పడిన నీటి లీకేజీని అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. తాత్కాలిక కాంక్రీట్ గేట్ల ద్వారా లీకేజీకి అడ్డుకట్ట వేశామని బుడమేర అప్రోచ్ రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

అలాగే ప్రకాశం బ్యారేజ్ దగ్గర గేటుకు అడ్డుపడ్డ పడవలను, వరద ఉధృతిని మంత్రి పరిశీలించారు. బోటు అడ్డుపడడంతో దెబ్బతిన్న 69వ గేటు కౌంటర్ వెయిట్ సరి చేసే పనులపై జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో గేటు మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

==========================

విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లోని సహాయక చర్యల్లో రాష్ట్ర మంత్రులు ఆనం రామ్ నారాయణ రెడ్డి, వంగలపూడి అనిత, కె. అచ్చెన్నాయుడు భాగమయ్యారు. వర్షాలకు జలమయమైన అజిత్ సింగ్ నగర్ లో పర్యటించి ప్రజలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. బాధితులందరినీ ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని, ఎవరూ అధైర్యపడద్దని బాధితులకు మంత్రులు భరోసా ఇచ్చారు. ఇందులో భాగంగా విజయవాడలోని ముంపు ప్రాంతాల్లో సహాయ చర్యలు అందించేందుకు గాను మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాలతో మచిలీపట్నం నుండి 40 ఫైబర్ బోట్లను విజయవాడకు తరలించారు. బోట్ల ద్వారా ఆహార పదార్థాలను కూడా స్థానిక మత్స్యకారులు పంపించారు. అదే విధంగా ఎన్టీఆర్ జిల్లా రామవరప్పాడు, కండ్రిక, రాజునగర్, వైఎస్ఆర్ కాలనీ ముంపు గ్రామాల్లో గిరిజన శాఖా గుమ్మడి సంధ్యారాణి పర్యటించారు. గ్రామస్తులను ఎన్డీఆర్ఎఫ్ బృందాల ద్వారా బోటులో సురక్షిత ప్రాంతానికి తరలించడం, ఆహార పంపిణీ వంటి సహాయక చర్యలను ప్రత్యక్షంగా మంత్రి పరిశీలించారు.

==========================

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. అమలాపురం కలెక్టరేట్లోని “ప్రజాసమస్యల పరిష్కార వేదిక” కార్యక్రమం ఈరోజు నిర్వహించారు. కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ టి నిషాంతితో పాటు పలువురు జిల్లా అధికారులు పిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందిన అర్జీలను ప్రాధాన్యత క్రమంగా ఎప్పటికప్పుడూ బాధ్యతాయుతంగా నూరు శాతం పరిష్కరించాలన్నారు.

==========================

కృష్ణానది కరకట్ట బలహీనంగా ఉన్న చోట్ల మరమ్మతులు చేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా పరిధిలో కరకట్టను ఈరోజు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... బలహీనంగా ఉన్నచోట్ల మరమ్మతులు చేస్తున్నామని, కృష్ణా నది వరద దృష్ట్యా తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశామని తెలిపారు. మొత్తం 12 చోట్ల కరకట్ట బలహీనంగా ఉన్నట్లు గుర్తించామని, దాన్ని కాపాడటంతో పాటు ప్రాణనష్టం జరగకుండా చూస్తామని మంత్రి పేర్కొన్నారు.

(వాయిస్ 25 సెకన్లు)

విరామం

==========================

ఆకాశావాణి విశాఖపట్నం కేంద్రంలోని ప్రాంతీయ వార్తా విభాగంలో క్యాజువల్ న్యూస్ రీడర్, క్యాజువల్ బ్రాడ్‌క్యాస్ట్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని విభాగాధిపతి శ్రీ సాయి వెంపాటి ఒక ప్రకటనలో తెలిపారు. క్యాజువల్ న్యూస్ రీడర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీతో పాటు, తెలుగు, ఆంగ్ల భాషల్లో నైపుణ్యం, మంచి స్వరం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అలాగే రేడియో, టీవీ జర్నలిజంలో అనుభవం ఉండాలని, తెలుగు టైపింగ్ తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు ఈ పోస్టులకు ధరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అదేవిధంగా క్యాజువల్ బ్రాడ్‌క్యాస్ట్ అసిస్టెంట్ పోస్టుకు రెడియో ప్రొడక్షన్‌లో ఏదైనా డిగ్రీ, లేదా డిప్లమా అర్హత కలిగి ఉండాలని, తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. అలాగే ఆడియో రికార్డింగ్, ఎడిటింగ్‌లో అనుభవం ఉండాలని సూచించారు. ధరఖాస్తులను సిరిపురంలోని ఆకాశవాణి, విశాఖపట్నం కేంద్రానికి పోస్టల్ ద్వారా సెప్టెంబరు 6వ తేదీలోగా పంపించాలని కోరారు.

==========================

విదర్భ, తెలంగాణ ప్రాంతాలలో వాయుగుండం కొనసాగుతోందని వాతావరణ కేంద్రం తెలిపింది. రామగుండం పట్టణానికి ఉత్తర ఈశాన్య దిశగా 135 కిలోమీటర్లు, వార్ధాకు అగ్నేయంగా 170 కిలోమీటర్లు దూరంలో ఈ వాయు గుండం కేంద్రీకృతమై ఉందని వెల్లడించింది. పశ్చిమ వాయువ్య బంగాళాఖాతంలో మరొక అల్పపీడనం ఈ నెల 5వ తేదీకి ఏర్పడే అవకాశం ఉని వాతావరణ కేంద్ర అధికారి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

==========================

రాష్ట్రలో అధిక వర్షాలు, వరదలు కారణంగా నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, అంగన్వాడి కేంద్రాలకు రేపు సెలవును ప్రకటించామని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సెలవును అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు.

==========================

తిరుమలలో అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ సేవను 8వ తేదీన తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 7వ తేదీ రాత్రి 9 గంటల నుంచి అక్టోబర్ 9వ తేదీ ఉదయం 6 గంటల వరకు ఘాట్ రోడ్డులో ద్విచక్రవాహనాలను అనుమతించమని టీటీడీ తెలిపింది. ఈ విషయాన్ని గమనించి భక్తులు సహకరించాలని కోరింది.

==========================

శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం కొబ్బరి పంటకు ఎంతో ప్రసిద్ధి గాంచిందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి రత్నాల వరప్రసాద్ అన్నారు. ఈ రోజు “ప్రపంచ కొబ్బరి దినోత్సవం” సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కొబ్బరి ఉత్పత్తులు చేసే వారికి ప్రోత్సహకాలు అందించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొబ్బరి తోటల విస్తరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా సహాయం అందిస్తున్నాయని తెలియజేశారు.

==========================

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) 90 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిగ్రీ విద్యార్థులకు ఈ నెల 19వ తేదీ నుంచి ఆన్ లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. దీనికి

సంబంధించిన పోస్టర్లను ఈ రోజు కలెక్టర్ కార్యాలయంలో ఇతర అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థుల్లో రిజర్వు బ్యాంక్, ఆర్థిక పర్యావరణ వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు ఈ “క్విజ్” పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు కనీసం ఇద్దరు చొప్పున జట్టుగా ఏర్పడి  ఈనెల 17వ తేదీ లోగా www.rbi90quiz.in వెబ్ సైట్ లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

============================

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. ఈరోజు చిత్తూరు నగరంలోని న్యాక్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పీఎం విశ్వకర్మ యోజన కింద తాపీ మేస్త్రీ, కార్పెంటర్ పనులకు సంబంధించి ప్రారంభించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.

============================

============================